క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి


కోడిశలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: ప్రతీ పౌరుడు సత్ప్రవర్తనతో మెలగాలని, చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మండలంలోని చిన్నకోడిశ, పెద్దకోడిశ, సరసనాపల్లి, జోడిబందల గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆమె..అక్కడి గ్రామస్తులకు మంచి నడవడికపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులంతా గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. అలాగే చిన్నచిన్న సమస్యలకు గ్రామాల్లోని ప్రజలు గొడవలు పడకుండా ఉండాలని తెలిపారు.

తాగునీటి స్వచ్ఛత పరిశీలన


తాగునీటి స్వచ్ఛతను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: మండలంలోని దోసరి గ్రామంలో ఉన్న తాగునీటి వనరులు, వాటి నుంచి లభ్యమయ్యే నీటి స్వచ్ఛతను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. మంచినీటి పరీక్షల నిమిత్తం సచివాలయాలకు పరీక్ష కిట్లు అందించామని, ఇంటి వద్ద బోరు తీసుకున్న వారు కూడా నీటి స్వచ్ఛతను తెలుసుకోవచ్చన్నారు. మంచినీటినే తాగునీటి కోసం వినియోగించాలని తెలిపారు. అలాగే రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసినాయుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహనదారుడి గోనె సంచి తనిఖీ చేస్తున్న సీఐ జైభీమ్

రాజాం: మండలంలోని పొగిరి, కంచరాం, గార్రాజుచీపురుపల్లి, గురవాం తదితర ప్రాంతాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఆదివారం వాహన తనిఖీలు చేశారు. సీఐ ఆర్.జైభీమ్ తన సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనాల్లో సోదాలు నిర్వహించారు. గంజాయి, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు రవాణా చేసినా, మద్యం అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఎక్కడికక్కడ వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

ఇంటింటా సర్వే


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటింటా సర్వే 36 శాతం పూర్తయినట్టు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని బొత్సవానివలస, పాల్తేరు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన ఆదివారం స్వయంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే సక్రమంగా చేపట్టాలని, పక్కాగా వివరాలు నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం 15,645 ఇళ్లకు గాను ఇప్పటివరకు 6,500కు పైగా ఇళ్లను జియోట్యాగ్ చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సర్వేను వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలి

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలని సీఐ నారాయణరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రామభద్రపురం, బాడంగి, తెర్లాం ఎస్‌ఐలు వి.ప్రసాదరావు, జె.తారకేశ్వరరావు, బి.సాగరబాబులతో ఆదివారం సమావేశమైన ఆయన.. గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదక ద్రవ్యాలతో పాటు మద్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల అనర్థాలతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. రౌడీ షీట్ ఓపెన్ అయిన వ్యక్తులపై కూడా నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

కొండంపేటలో..
ఆధ్యాత్మిక ఝరి!


కొండంపేటలోని అయ్యప్పస్వామి ఆలయం

- అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదానం
- వందలాదిగా తరలివస్తున్న భక్తులు
- గ్రామంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం

రాజాం: పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామం ఆధ్యాత్మిక ఝరిలో ఉంది. కార్తీకమాసం ఆరంభం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. ప్రధానంగా గ్రామంలోని శ్రీధర్మ శాస్తా హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయం.. కార్తీకమాస ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా మారింది. రాజాంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదాన్ని ఉచితంగా అందించే సన్నిధిగా మారింది. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులకు ఇక్కడకు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించడంతో పాటు ఇక్కడ జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక చింతనతో వెలిగిపోతోంది.

గత ఏడేళ్లుగా..


సన్నిధానంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొండంపేట శివాలయం సమీపంలో పదేళ్ల క్రితం నుంచే అయ్యప్పస్వాముల సన్నిధానం ఉంది. ఏడేళ్ల క్రితం గ్రామానికి చెందిన ముద్దన సత్యారావు ఇక్కడ హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ప్రతీ ఏడాది కార్తీకమాసం సమయంలో కేవలం అయ్యప్ప, శివమాలలు వేసిన భక్తులకు ఇక్కడ ఉచితంగా అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. అప్పటి నుంచి రాజాంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, పనిచేసే కార్మికులు, వచ్చివెళ్లిపోయే వ్యాపారులకు ఈ సన్నిధానం నిష్ఠతో కూడిన అన్నప్రసాదాన్ని ఉచితంగా అందించే అన్నసత్రంగా మారింది. ప్రతీ ఏడాది ఈ తరహా ప్రసాదాన్ని అందిస్తుండడంతో కొండంపేట అయ్యప్పస్వామి ఆలయానికి అనతికాలంలోనే ఖ్యాతి వచ్చింది. గత మూడేళ్లుగా ప్రతీ ఏడాది కార్తీకమాసంలో ప్రతిరోజూ 500లకు పైబడి భక్తులు ఇక్కడ సన్నిధానానికి తరలివస్తున్నారు. ఈ ఏడాది ఆ సంఖ్య 600లకు చేరింది. ఎంతమంది భక్తులు వచ్చినా పూర్తిస్థాయిలో ఉచితంగా అన్నప్రసాదాన్ని ఇక్కడ నిర్వాహకులు అందించడం విశేషం.

గ్రామస్తుల సహకారం మరువలేనిది..



ఇక్కడ అయ్యప్పస్వామి ఆలయం నిర్మించాలని గ్రామానికి చెందిన అయ్యప్పభక్తులు భావించారు. అందులో నన్ను భాగస్వామ్యం చేశారు. మొత్తం బాధ్యత తీసుకుని ఆలయాన్ని నిర్మించాం. ఏడాది పొడవునా ఇక్కడ పూజలు జరుగుతుంటాయి. కార్తీకంలో ప్రతిరోజూ దీక్షలో ఉండే అయ్యప్ప, శివ స్వాములకు ఇక్కడ ఉచితంగా అన్నప్రసాదాలు అందిస్తున్నాం. గ్రామస్తులు, భక్తుల సహకారం మరువలేనిది.

–ముద్దన సత్యారావు, ఆలయ ధర్మకర్త

కమ్ముకున్న పొగమంచు



మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామ పరిసరాలను పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం 7 గంటల వరకు దట్టంగా కురిసిన పొగమంచు కారణంగా రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాదచారులు కూడా ఎదురుగా వచ్చే వాహనాన్ని దగ్గరకు వస్తేగానీ పసిగట్టలేని పరిస్థితి. శీతాకాలం ఆరంభంలోనే ఇలా ఉంటే ముున్ముందు ఎలా ఉంటుందోనని స్థానికులు అనుకుంటున్నారు. –రేగిడి

విద్యుత్ ట్రూఅప్ చార్జీల రద్దుకు డిమాండ్



విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ధర్నాకు దిగారు. రామభద్రపురం మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నేత బలస శ్రీనివాసరావు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు సైతం ఉపాధి హామీ పథకం పనులు తగ్గించి, పేదల పొట్ట కొట్టేందుకు తయారైందని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14వ తేదీన అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పేరిట ఆందోళన చేపట్టనున్నామన్నారు. –రామభద్రపురం

మంత్రి గారూ.. పాఠశాల తెరిపించండి!



రాజాం మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మయ్యపేట గిరిజన గ్రామంలో మూసివేసిన పాఠశాలను తెరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా పాఠశాల ఎదుట ఆదివారం ఆందోళన చేపట్టారు. సరిగ్గా పదేళ్ల క్రితం పాఠశాలలో 10 మంది పిల్లలు కన్నా తక్కువ మంది ఉన్నారన్న కారణంతో పాఠశాలను మూసివేశారని గ్రామస్తులు పాలవలస రాము, ఆమిటి బలరాంలు తెలిపారు. అప్పటి నుంచి విద్యార్థులు నష్టపోకూడదన్న సదుద్దేశ్యంతో గ్రామాన్ని దత్తత తీసుకున్న రొటేరియన్ నప్పటి వసంతరావు ఉదయం రెండు గంటల చొప్పున ప్రైవేటు చెప్పేవారన్నారు. ప్రస్తుతం గ్రామంలో 15 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, వారంతా రాజాం పట్టణానికి ఆటోల్లో వెళ్లి చదువుకోవాలంటే వ్యయప్రయాసలతో కూడిన ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి గారు స్పందించి, పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు. –రాజాం

ఓల్డ్ ఫ్రెండ్స్ ఆత్మీయ సమ్మేళనం


రాజాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం తృప్తి రిసార్ట్‌లో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు(రాజాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వీరంతా 2004లో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌గా ఏర్పాటై, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అసోసియేషన్ ఏర్పడి 20 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మరోసారి వారంతా కలిసి తమ పాఠశాల రోజులను గుర్తు చేసుకుని, సరదాగా గడిపారు. భవిష్యత్‌లో అసోసియేషన్ ద్వారా చేపట్టనున్న మరెన్నో సేవా కార్యక్రమాలపై చర్చించుకున్నారు. చదువుకున్న పాఠశాలతో పాటు నిరుపేద విద్యార్థుల చదువులకు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండల కేంద్రంలోని బస్టాండ్ జంక్షన్‌లో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా మద్యంబాటిళ్లు పట్టుబడ్డాయని, వాటిని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లోని రైతులకు నవధాన్యాల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో రైతులు ఎక్కువగా అపరాల పంటలు సాగు చేస్తుంటారని, అందులో నవధాన్యాలను అంతరపంటగా వేసుకుంటే మంచి లాభాలు వస్తాయని సూచించారు. అలాగే ఒకే దఫా రెండు నుంచి మూడు రకాల పంటలు దిగుబడిగా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, సింహాచలం, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అఖండ నామ సంకీర్తన


సత్యసాయిని ఆరాధిస్తూ కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలోని పలు సత్యసాయి మందిరాల్లో ఆదివారం నిర్వహించిన సత్యసాయి అఖండ నామ సంకీర్తన ఆకట్టుకుంది. 24 గంటల పాటు సాయి నామం జపిస్తూ భక్తులు భజనలు చేశారు. ప్రపంచ సత్యసాయి అఖండ నామ సంకీర్తనలో భాగంగా ఈ కార్యక్రమం రాజాంలో చేసినట్లు సత్యసాయి భజన మండలి సభ్యులు తెలిపారు.

రేగిడి: మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో సత్యసాయి అఖండ నామ సంకీర్తన చేపట్టారు.

వంగర: మండలంలోని మద్దివలసలో ఉన్న శ్రీసత్యసాయిబాబా ఆలయంలో సత్యసాయి అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఆదివారం జరిగింది. 24 గంటల పాటు సంకీర్తనలు ఆలపించిన అనంతరం దీపారాధన నిర్వహించారు.

విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తా


మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

బొబ్బిలి: తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనిధి పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, రామభద్రపురం మండల స్వర్ణోత్సవ మహాసభలకు ము ఖ్య అతిథిగా హాజరైన ఆమె.. విద్యారంగ అభివృద్ధి కి అవసరమైన సంస్కరణలు తీసుకువస్తానన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న నీటి సంఘాల ఎన్నికలు


ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మెంటాడ: మండలంలోని మూడు మధ్య తరహా, 11 చిన్న తరహా నీటిసంఘాల ఎన్నికలు ఈ నెల 21వ తేదీన జరగనున్నట్లు తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేస్తారని, పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా 1432 ఫసలి నీటిపన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. నీటిపన్ను బకాయి ఉన్నా 1432 ఫసలి చెల్లించనివారు పోటీకి అనర్హులన్నారు. పన్నును సచివాలయంలో కూడా కట్టవచ్చని, మొత్తం 14 నీటి సంఘాలకు ఒక్కో మెంబర్‌ను ఓటర్లు ఎన్నుకుంటారన్నారు. ఓటరు జాబితా సచివాలయంలో అందుబాటులో ఉంటుందని, సందేహాలుంటే గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు.

బాడంగి: తహసీల్దారు కార్యాలయం వద్ద నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాల వద్ద కూడా ఓటరు జాబితా అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దారు కె.సుధాకర్ తెలిపారు.

ఓటర్లుగా నమోదు కావాలి


రామభద్రపురం ఉన్నత పాఠశాలలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దారు సులోచనరాణి


రాజాం: బొద్దాం బీఎల్‌వో వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దారు రాజు

తెర్లాం: అర్హులైన యువతీయువకులంతా ఓటర్లుగా నమోదు కావాలని మండల ఉప తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని సుందరాడ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఇంతవరకు ఎంతమంది కొత్తగా ఓటర్లుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్ల వయసు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి, కూడా దరఖాస్తులు తీసుకునేటప్పుడు వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయా.. లేవా.. అన్నది సరిచూసుకోవాలన్నారు.

రాజాం: మండలంలోని బొద్దాం, విజయరాంపురం, పొగిరి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తహసీల్దారు ఎస్‌కే రాజు ఆదివారం పరిశీలించి, బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పులను కూడా సక్రమంగా చేయాలని తెలిపారు. అనంతరం ఓటరు నమోదుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఓటరు వివరాల్లోని మార్పులు, చేర్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న విషయాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ రాజశేఖర్, ఎన్నికల డీటీ ప్రకాష్, ఆర్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం: ఓటరు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉప తహసీల్దారు సత్యనారాయణ


బాడంగి: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సుధాకర్

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాలలో చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తహసీల్దారు కె.సుధాకర్ ఆదివారం పరిశీలించి, బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

రామభద్రపురం: కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమని తహసీల్దారు సులోచనరాణి అన్నారు. మండలంలోని ఆరికతోట, బూసాయవలస, రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ప్రజాస్వామ్యంలో సురక్షిత పాలనకు ఓటే వజ్రాయుధమని, ఓటు హక్కు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అర్హత కలిగిన వారంతా డిసెంబరు నెలాఖరులోగా కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

భయం గుప్పిట్లో వైద్య సిబ్బంది

రామభద్రపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది భయం భయంతో సేవలందిస్తున్నారు. మరీ ముఖ్యంగా రాత్రి సమయంలో వారు సేవలందించేందుకు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని సిబ్బంది భద్రతకు సంబంధిత అధికారులు చర్యలేవీ చేపట్టకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. 24 గంటల పాటు సేవలందించాల్సిన వైద్య సిబ్బందికి భద్రత లేకపోతే సేవలందించలేమని తెగేసి చెబుతున్నారు. వైద్యం కోసం రోజులో పదుల సంఖ్యలో ఆస్పత్రికి రోగులు వస్తుంటారని, వారిలో ఎవరెలా ప్రవర్తిస్తారో తెలీదని అంటున్నారు.

శనివారం రాత్రి ఓ వ్యక్తి వీరంగం..

మండల కేంద్రానికి చెందిన వారు శనివారం రాత్రి 11 గంటల సమయంలో డెలివరీ కోసం ఓ గర్భిణిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. గర్భిణి వెంట వచ్చిన వారిలో ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి, ఇక్కడ డెలివరీ చేసిన స్టాఫ్‌నర్స్‌పై వీరంగం వేశాడు. నానా బూతు తిట్లు తిట్టాడు, ఆమె భయపడి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఆఖరికి పోలీసులు వచ్చి గట్టిగా హెచ్చరిస్తే వెళ్లిపోయాడు. ఈ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయని, రాత్రి పూట వైద్యసేవలందించే స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రత ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

సంతకవిటి: మండలంలోని 24 గ్రామ సచివాలయాల వద్ద నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలను ఆదివారం ప్రదర్శించారు. జాబితాలోని వివరాలపై ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే వీఆర్‌వోలకు తెలియజేయాలని తహసీల్దారు బి.సత్యం తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఓటరు వివరాల తుది జాబితా వెల్లడిస్తామన్నారు.

సంక్షిప్తంగా...

ఇళ్లస్థలాలు ఇవ్వండి

బొబ్బిలి: పారిశుధ్య కార్మికులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని పాకి వీధి పారిశుధ్య కార్మికుల ఇళ్లకు సంబంధించి, కేటాయించిన స్థలాన్ని ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మించాలనుకోవడం దుర్మార్గమన్నారు. పోలీసుల ద్వారా కార్మికులను బెదిరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారి తరఫున పోరాడతామన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పుస్తకాలు ఏవిధంగా చదవాలని, అందులోని విషయాలను ఎలా అర్థం చేసుకోవాలన్న అంశాలను లైబ్రేరియన్ నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులు చేరాలని కోరారు. సాయంత్రం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

అగ్ని అస్త్రంతో కత్తెరపురుగు నివారణ

రాజాం సిటీ: మొక్కజొన్న, వంగతోటలను ఆశిస్తున్న కత్తెరపురుగును అగ్నిఅస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్1 రమాదేవి తెలిపారు. మండలంలోని ముద్దాడజోగివలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఎకరానికి సరిపడ అగ్నిఅస్త్రం తయారీకి 15 లీటర్ల ఆవుమూత్రం, 5 కేజీల వేపాకులు, కిలో పచ్చిమిర్చి, అరకిలో వెల్లుల్లి, రెండు కిలోల పొగాకు కాడలు తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెద్ద టబ్బులో వేసుకుని నాలుగు పొంగులు వచ్చేంత వరకు మరగబెట్టాలి. చల్లారిన అనంతరం 48 గంటల తర్వాత వడపోసుకుని మొక్కజొన్న, వంగ పంటల్లో పిచికారీ చేస్తే కత్తెరపురుగు రాకుండా చేయొచ్చన్నారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువైంది. సాధారణంగా ఆదివారం సెలవుదినం కావడంతో కాల్ డాక్టర్ మాత్రమే విధుల్లో ఉంటారని, మిగిలిన వైద్యులెవరూ ఉండరని తెలిసి రోగులు అంతగా ఆస్పత్రికి రారు. అయితే ఈ ఆదివారం మాత్రం అందుకు భిన్నంగా ఆస్పత్రిలో వాతావరణం కనిపించింది. జ్వరం, విరేచనాలు, ఒళ్లు, కాళ్లు నొప్పులతో బాధపడే చాలామంది వైద్యసేవల కోసం ఆస్పత్రిని ఆశ్రయించారు. అయితే రోగులకు సరిపడ వైద్యులు, మందులు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో సకాలంలో వైద్యం పొందలేకపోతున్నామని రోగులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వైద్య సిబ్బంది కొరతను తీర్చాలని రోగులు కోరుతున్నారు.